కులగణన కోసం రేపు సత్యాగ్రహ దీక్ష

విద్యార్థులు భారీగా తరలిరావాలి: వీ శ్రీనివాస్‌గౌడ్

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను సత్యాగ్రహ దీక్షకు ఆహ్వానిస్తున్న ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ నేతలు. చిత్రంలో కిరణ్‌కుమార్, సాయికిరణ్, శివ తదితరులు

హైదరాబాద్, సెప్టెంబర్12 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) ప్రధాన గేటు వద్ద శనివారం నిర్వహించ తలపెట్టిన ఓబీసీ సత్యాగ్రహ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి విద్యార్థులు భారీగా తరలిరావాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత వీ శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ దీక్షలో పాల్గొనాల్సిందిగా శ్రీనివాస్‌గౌడ్‌ను అసోసియేషన్ నేతలు గురువారం కలిసి ఆహ్వానించారు. ఆయన సానుకూలంగా స్పందించడమేగాక దీక్షకు మద్దతు ప్రకటించారు. దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించడంతోపాటు, రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం సీలింగ్ ఎత్తివేయాలని, బీసీలకు జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్లు ఇవ్వాలని, దేశవ్యాప్తంగా ఓబీసీ నేషనల్ ఫెలోషిప్‌లను రూ.5 వేలకు పెంచాలని ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రప్రభుత్వం కూడా 3 నెలల్లో కులాలగణన చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ అమలుచేయాలని కోరారు. కులగణనతోనే వెనుకబడిన కులాల అభివృద్ధి సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, జాతీయ కార్యదర్శి సాయికిరణ్, రాష్ట్ర అధ్యక్షుడు శివ ముదిరాజ్, సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి నాయకులు అభినేశ్, బొమ్మ ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు నిర్వీర్యానికే చట్ట సవరణలు

- కేంద్రం తీసుకొచ్చే సవరణ బిల్లుతో ముస్లిములకు తీవ్రనష్టం
- చట్ట సవరణకు వ్యతిరేకంగా కేసీఆర్ జేపీసీకి లేఖ రాశారు..
- మీడియా సమావేశంలో మాజీ మంత్రి మహమూద్ అలీ

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి మహమూద్ అలీ

హైదరాబాద్, సెప్టెంబర్ 12(నమస్తే తెలంగాణ): వక్ఫ్ బోర్డును నిర్వీర్యం చేయాలనే ఉద్దేశంతో చట్ట సవరణలకు ప్రతిపాదించి, వక్ఫ్ బోర్డుపై దుష్ప్రచారాలు చేస్తున్నారని మాజీ మంత్రి మహమూద్ అలీ అన్నారు. తెలంగాణ భవన్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ మైనార్టీ నాయకులతో కలిసి మహమూద్ అలీ మాట్లాడారు. 1995 వక్ఫ్ యాక్ట్‌లో 44 సవరణలను కేంద్రం ప్రతిపాదించిందని, సవరణలు దుర్మార్గమైనవని తెలిపారు. పదేండ్లలో కూడా వక్ఫ్ బోర్డుకు అన్యాయం చేయాలని చూశారని, కానీ వారి ప్రయత్నాలను కేసీఆర్ సాగనివ్వలేదన్నారు. వక్ఫ్ బోర్డుకు అన్యాయం చేయడానికే కేంద్రం సవరణ బిల్లును తీసుకువస్తున్నదని, అందుకు జాయింట్ పార్లమెంటరీ కమిటీని నియమించారని తెలిపారు. సవరణలను బీఆర్ఎస్ పార్టీ వ్యతిరేకిస్తున్నదని, కేసీఆర్ సైతం జేపీసీకి లేఖ రాశారని గుర్తుచేశారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుతో ముస్లిములకు తీవ్రనష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ సలీం, వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ మసియుల్లాఖాన్, జమీల్, మునీర్, బాసిత్ పాల్గొన్నారు.

వనపర్తిలో కూల్చివేతలు

- నల్లచెరువు పరిధిలో గోడ తొలగింపు
- 15 మంది ఇండ్ల యజమానులకు నోటీసులు

వనపర్తి నల్లచెరువు పరిధిలో నీళ్లు రాకుండా కట్టిన గోడను కూలుస్తున్న జేసీబీ

వనపర్తి, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ) : వనపర్తి ప్రజల్లోనూ హైడ్రా తరహాలో హడల్ మొదలైంది. జిల్లా కేంద్రానికి సమీపంలోని నల్లచెరువు నీళ్లు పట్టణంలోకి రాకుండా కట్టిన గోడను గురువారం జేసీబీతో అధికారులు కూలగొట్టారు. ఈ చెరువు పరిధిలో నిర్మాణాలు చేపట్టిన 9 మందికి, తాళ్ల చెరువు పరిధిలో నిర్మాణ యజమానులు ఆరుగురికి మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేయడంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారుల అనుమతులతోనే నిర్మాణాలు చేపట్టామని వారు చెబుతున్నారు. తమున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్‌ను సంప్రదించగా.. పట్టణం చుట్టూ ఉన్న నాలుగు చెరువులకు సంబంధించి సర్వే చేస్తున్నట్టు తెలిపారు. చిన్న గోడ మాత్రమే కూల్చామని, ఇంకా ఇండ్ల వరకు వెళ్లలేదని ఆయన పేర్కొన్నారు.

మూలవాగు వెంట రెండో రోజూ సర్వే

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని రెండో బైపాస్ రహదారి మూలవాగు వెంట గురువారం రెండోరోజైన గురువారం డివిజనల్ సర్వే అధికారి బాలచంద్రం ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ మూలవాగు సరిహద్దును ఆనుకొని దాదాపు 60 సర్వే నంబర్లు ఉన్నాయని, ప్రస్తుతానికి 10 మాత్రమే పూర్తయ్యాయని చెప్పారు. మొత్తం ప్రక్రియ పూర్తయ్యాక కలెక్టర్‌కు నివేదిక ఇస్తామని పేర్కొన్నారు. - వేములవాడ

కబ్జాదారులం కాదు.. రిటైర్డు ఉద్యోగులం

- సమాచారం లేకుండానే మా స్థలాలు ఎఫ్‌టీఎల్ లోకి..
- ఓ అధికారి తప్పిదంతో ఈ అవస్థలు
- రీ సర్వేకు ఆదేశాలు ఇచ్చిన విజిలెన్స్ సెల్
- నోటీసులివ్వకుండానే హైడ్రా కూల్చివేతలు
- గుట్టలబేగంపేట బాధితుల ఆవేదన

సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సైట్ రిటైర్డ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ కొండయ్య

ఖైరతాబాద్, సెప్టెంబర్ 12: 'ప్రభుత్వానికి 35 ఏండ్ల పాటు సర్వీసు అందించి.. పైసా పైసా కూడపెట్టుకొని.. సొసైటీగా ఏర్పడి కొనుకున్న స్థలాన్ని తమకు సమాచారం ఇవ్వకుండానే ఎఫ్‌టీఎల్‌లో చేర్చారు.. డ్రాఫ్ట్ ఎఫ్‌టీఎల్‌లో ఉన్న స్థలంలో నిర్మాణాలను నోటీసులివ్వకుండానే కూల్చివేశారు. ' అని స్థల యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం మీడియా సమావేశంలో సైట్ (స్మాల్ ఇండస్ట్రీస్ ఎక్స్‌టెన్షన్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్) రిటైర్డ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ చుక్కా కొండయ్య మాట్లాడుతూ.. 1992లో సైట్ ఉద్యోగలంతా సైట్ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌజింగ్ సొసైటీని ఏర్పాటు చేసుకొని తమ సొంతింటి కల నెనవేర్చుకునేందుకు రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గుట్టలబేగంపేటలో సర్వే నం. 12, 12ఏ, 13లో 24 ఎకరాలు కొనుగోలు చేశామని చెప్పారు. అదే సంవత్సరం హుడా సొసైటీకి అనుమతినిచ్చిందని తెలిపారు. 236 మంది సభ్యులం ఇక్కడ 220 గజాల చొప్పున సొంతం చేసుకున్నామని చెప్పారు. పదవీ విరమణ పొందిన తర్వాత కొందరు ఇక్కడ నిర్మాణాలు చేపట్టారని, ఆస్తి పన్ను, విద్యుత్, నీటి బిల్లులు కూడా చెల్లిస్తున్నామని తెలిపారు. ఈ ప్లాట్లు నీటి మట్టానికి ఎత్తులో గుట్టలపై ఉందని, 2014 వరకు ఎఫ్‌టీఎల్ పరిధిలో లేదని చెప్పారు. ఓ అధికారి చర్యల వల్ల తమకు తెలియకుండానే ఎఫ్‌టీఎల్‌లో చేర్చారని, అది కూడా డ్రాఫ్ట్ ఎఫ్‌టీఎల్‌లో చేర్చినట్టు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. దీంతో రీసర్వే చేయించాలని అనేక వినతులు ప్రభుత్వానికి పంపించామని, 2019లో విజిలెన్స్ సెల్‌ను ఆశ్రయించగా, రీసర్వే చేయాల్సిందిగా వారు సిఫారసు చేశారని తెలిపారు. తాజాగా ఈ ఏడాది జూన్, జూలైలో సంబంధిత శాఖకు రీసర్వే కోసం లేఖ రాయగా, తాత్సారం చేశారని చెప్పారు. ఫలితంగా హైడ్రా ఈ నెల 8న ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా డ్రాఫ్ట్ ఎఫ్‌టీఎల్‌లో ఉన్న ఈ స్థలాన్ని నిర్దాక్షిణ్యంగా కూల్చివేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. కొన్ని సామాజిక, ప్రసార మాధ్యమాల్లో తమను కబ్జాదారులుగా చిత్రీకరిస్తున్నారని, తాము కబ్జాదారులం కాదని, ప్రభుత్వానికి సేవలందించి పదవీ విరమణ పొందిన ఉద్యోగలమని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సొసైటీ అధ్యక్షులు బీఎస్ఎస్ఎన్ రాజు, శివశంకర్, నాగేందర్, రవి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కోటిన్నర మెటీరియల్ ధ్వంసం

బ్యాంకులో అప్పు చేసి ప్లంబింగ్ వస్తువుల వ్యాపారం ప్రారంభించాను. గుట్టల బేగంపేటలో ప్లాట్ నం.189లో చిన్న షెడ్డు వేసుకొని నలుగురు పార్ట్‌నర్స్‌తో కలిసి వ్యాపారం చేస్తున్నాను. పది సంవత్సరాలుగా జీహెచ్‌ఎంసీకి ఆస్తి పన్ను, కరెంటు బిల్లు కడుతున్నాను. ఈ నెల 8న సుమారు కోటిన్నర విలువైన ప్లంబింగ్ మెటీరియల్ షెడ్డులోనే ఉండగా, ఎలాంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండానే కూల్చివేశారు. - రూపారాం చౌదరి, బాధితుడు

మా అమ్మ చివరి కోరిక ఇల్లు

మా నాన్న నాగేంద్ర కుమార్ సివిల్ ఇంజినీర్. 2013లో ప్లాట్ నం.185ను గుట్టల బేగంపేటలో కొనుగోలు చేశారు. పక్కనే మా నాన్న స్నేహితుడు ప్లాట్ నం.186లో కొన్నారు. ఇద్దరూ కలిసి 2016లో జీహెచ్‌ఎంసీ అనుమతితో జీ+4 నిర్మాణం చేపట్టారు. ఆ తర్వాత ఈ స్థలం డ్రాఫ్ట్ ఎఫ్‌టీఎల్ ఉందని తెలియడంతో హైకోర్టును ఆశ్రయించాం. కోర్టు స్టేటస్‌కో ఇచ్చింది. ఆ కేసు విచారణలో ఉండగానే నోటీసు ఇవ్వకుండా మా ఇంటిని కూల్చివేశారు. - నీరద్ నున్న, బాధితుడు

ఆ అధికారికి వెయ్యి గజాలు ఇవ్వనందుకే

2014లో ఇరిగేషన్ శాఖలో ఎస్ఈ స్థాయి అధికారి వెయ్యి గజాలు తనకు రాసివ్వాలని కోరారు. అందుకు మా సొసైటీ నిరాకరించింది. అది మనసులో పెట్టుకొని ఈ స్థలాన్ని అదే ఏడాది ఎఫ్‌టీఎల్‌లో మార్చారు. వాస్తవానికి 2014కు ముందు ఈ స్థలం ఎఫ్‌టీఎల్ పరిధిలో లేదు. గుట్టలపై నీటి మట్టానికి ఎత్తులో ఉంటే ఈ స్థలం ఎఫ్‌టీఎల్ పరిధిలోకి ఎలా వస్తుంది? - రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ సదానందం, బాధితుడు

ఎట్టకేలకు ఆర్టీసీలో పండుగ అడ్వాన్స్

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ) : ఆర్టీసీ జేఏసీ ఒత్తిడికి ఆర్టీసీ యాజమాన్యం దిగొచ్చి, పండుగ అడ్వాన్స్ చెల్లించడానికి అంగీకరించింది. గతంలో నిలిపివేసిన పండుగ అడ్వాన్స్‌ను పునరుద్ధరిస్తున్నట్టు ప్రకటించింది. దసరా అడ్వాన్స్‌గా క్లాస్-3 ఉద్యోగులకు 6 వేలు, క్లాస్-4 ఉద్యోగులకు 5,500 ఇవ్వనున్నట్టు పేర్కొంది. 25 వేల మంది కార్మికులకు ప్రయోజనం చేకూరనుందని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ థామస్‌రెడ్డి, కన్వీనర్ మౌలానా, కోకన్వీనర్ యాదయ్య, సురేశ్ పేర్కొన్నారు.

ఇరిగేషన్‌శాఖలో ప్రత్యేక ఎలక్ట్రికల్ డివిజన్!

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): ఇరిగేషన్‌శాఖలో ప్రత్యేకంగా ఎలక్ట్రికల్ డివిజన్‌ను ఏర్పాటు చేయాలని సమాలోచనలు చేస్తున్నారు. ఈ మేరకు ప్రభుత్వానికి ఇప్పటికే ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులు ప్రతిపాదనలు పంపారు. ఎత్తిపోతల పథకాల ప్రాధాన్యాన్ని గుర్తించి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ శాఖకు ప్రత్యేకంగా 150 ఎలక్ట్రికల్ పోస్టులను మంజూరు చేసింది. అభ్యర్థుల ఎంపిక కూడా పూర్తయ్యింది. ప్రభుత్వ సలహాదారు పెంటారెడ్డి నేతృత్వంలో ప్రత్యేక డివిజన్ ఏర్పాటు చేసి ఎలక్ట్రికల్ ఇంజినీర్లకు తర్ఫీదు నివ్వాలని ఈ శాఖ నిర్ణయించింది.

విద్యుత్తు కొనుగోళ్లకు అనుమతించండి

- ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్‌కు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): రోజువారీ అవసరాల కోసం ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్ (ఐఈఈ) నుంచి విద్యుత్తు కొనుగోలు చేసేందుకు తెలంగాణ డిస్కంలకు హైకోర్టు అనుమతించింది. దీంతో 60 మిలియన్ యూనిట్ల విద్యుత్తు కొనుగోలుకు ఎస్పీడీసీఎల్‌కు అడ్డంకులు తొలగిపోయాయి. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు. సమగ్ర వివరాలతో కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణ దసరా సెలవుల తర్వాత చేపడతామని ప్రకటించింది.

క్యాబినెట్ విస్తరణ ఈసారైనా తేలేనా?

- అధిష్ఠానంతో మరోమారు సీఎం రేవంత్ చర్చలు
- అధ్యక్షుడు ఖర్గే, సెక్రటరీ కేసీ వేణుగోపాల్‌తో భేటీ
- ఆ తర్వాత కీలక నేతలతో లంచ్ మీటింగ్‌లో చర్చ

హైదరాబాద్, సెప్టెంబర్ 12(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రివర్గ విస్తరణ 'ఓ స్త్రీ రేపు రా' అన్నట్టు తయారైంది. క్యాబినెట్ విస్తరణ నేడో రేపో అంటూ ఎనిమిది నెలలుగా వాయిదా పడుతూనే ఉన్నది. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు ఇతర నేతలు ఢిల్లీ వెళ్లడం, అధిష్ఠానంతో చర్చించడం, తిరిగి రావడం, ఇక రేపో మాపో అయిపోతుందని లీకులు ఇవ్వడం పరిపాటిగా మారిపోయింది. దీనికి కొనసాగింపుగాను మంత్రివర్గ విస్తరణపై గురువారం ఢిల్లీలో మరోసారి హైడ్రామా నడిచింది. ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి అధిష్ఠానం పెద్దలు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో వరుసగా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు టీపీసీసీ నూతన అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ వ్యూహకర్త సునీల్ కనుగోలు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రివర్గ కూర్పుపై లోతుగా చర్చించినట్టు తెలిసింది. సామాజిక కూర్పు, సీనియార్టీ, జిల్లా ప్రాతిపదికన పలువురు పేర్లపై చర్చించినట్టు సమాచారం. ఆ తర్వాత సీఎం రేవంత్ నివాసంలో కీలక నేతలు లంచ్ మీటింగ్‌లో తదుపరి చర్చలు కొనసాగించినట్టు తెలిసింది. ప్రస్తుతం మంత్రివర్గంలో ఆరు ఖాళీలు ఉండగా మొత్తం భర్తీ చేయాలా లేక సగం భర్తీ చేసి మిగిలినవి ఆపేయాలా అన్న అంశంపైనా చర్చించినట్టు చెప్తున్నారు. ఈ సారైనా చర్చలు ఫలించి మంత్రివర్గ విస్తరణ పూర్తవుతుందా లేక షరామామూలుగానే మళ్లీ పెండింగ్‌లో పడుతుందా అన్న అనుమానాలు కాంగ్రెస్ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.

పట్టించుకోని బడే భాయ్?

- సీఎంకు దొరకని మోదీ, షా అపాయింట్‌మెంట్

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి తన ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నించినట్టు సమాచారం. అయితే వారు స్పందించలేదని ఢిల్లీ వర్గాలు చెప్తున్నాయి. పార్టీ పనుల కోసం ఢిల్లీకి చక్కర్లు కొడుతున్నారన్న విమర్శల నేపథ్యంలో.. ప్రధానిని, అమిత్ షాను కలిసి, ఒక వినతి పత్రం ఇవ్వాలని, అధికారిక పర్యటన కోసమే వచ్చానని చెప్పుకోవాలని సీఎం భావించారని అంటున్నారు. అయితే వారు అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడంతో ఉసూరుమన్నారని చెప్పుకుంటున్నారు.

ప్రతిపక్ష ఎమ్మెల్యేకే పీఏసీ చైర్మన్ పదవి

- పార్టీ ఫిరాయింపుల చట్టం కఠినంగా ఉంటే మాకే మంచిది
- గత ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా జర్నలిస్టులకు అక్రెడిటేషన్లు
- ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేకే ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ) చైర్మన్ పదవి ఇచ్చినట్టు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఢిల్లీలో గురువారం ఆయన మీడియాతో చిట్‌చాట్ చేశారు. పార్టీ ఫిరాయింపులపై చట్టం కఠినంగా ఉంటే అది తమ ప్రభుత్వానికే మంచిదని అన్నారు. ఎమ్మెల్యేల ఫిరాయింపులపై కోర్టు తీర్పులు తమకు మేలు చేస్తాయని తెలిపారు. జర్నలిస్టులకు గత ప్రభుత్వం ఇబ్బడిముబ్బడిగా అక్రెడిటేషన్లు ఇచ్చిందని ఆరోపించారు. ఇప్పుడు కొత్త అక్రెడిటేషన్ల మంజూరికి విధివిధానాలు రూపొందించడంలో జర్నలిస్ట్ సంఘాలు కీలకపాత్ర పోషించాలని సూచించారు.

మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న నేతలు జంగయ్య, నారాయణ, మధుసూదన్

సర్కారుకు గురుకుల జేఏసీ సమ్మె నోటీసు

- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- పనివేళలు మార్చాలని అల్టిమేటం
- 18 నుంచి ఆందోళనలకు పిలుపు

హైదరాబాద్, సెప్టెంబర్12 (నమస్తే తెలంగాణ) : గురుకులాల్లో సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, లేకుంటే దశలవారీగా ఆందోళనలు చేపడుతామని రాష్ట్ర సర్కారుకు టీఎస్‌యూటీఎఫ్, గురుకుల జేఏసీ అల్టిమేటం జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని కలిసి సమ్మె నోటీసు అందజేసింది. 28న మహాధర్నా నిర్వహించనున్నట్టు వెల్లడించింది. అనంతరం సెక్రటేరియట్ మీడియా పాయింట్ వద్ద యూటీఎఫ్, గురుకుల జేఏసీ నేతలు జంగయ్య, మామిడి నారాయణ, మధుసూదన్ మాట్లాడుతూ.. తెలంగాణలో 5శాఖల పరిధిలోని సొసైటీల కింద 1,022 గురుకులాలు ఉన్నాయని, వీటిలో సుమారు 600లకు పైగా అద్దె భవనాల్లో అరకొర వసతుల నడుమ కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. మెస్‌చార్జీలు పెంచకపోవడంతో విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం కష్టమవుతుందని, ఇటీవల నిర్ణయించిన పనివేళలు శాస్త్రీయంగా లేవని, విద్యార్థులు, ఉపాధ్యాయులపై తీవ్ర మానసిక ఒత్తిడి పెరుగుతుందని వివరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఇప్పటికే పలుమార్లు విన్నవించినా ప్రభుత్వం స్పందించకపోవడంపై మండిపడ్డారు. ఈ నేపథ్యంలోనే వాస్తవ పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు దశలవారీగా ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. 18,19 తేదీల్లో పాఠశాలల్లో భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసనలు, 22,23 తేదీల్లో ఎమ్మెల్యేలు, కలెక్టర్లకు వినతిపత్రాల అందజేత, 28న హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహించనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో చావ రవి, నర్సింహగౌడ్, జగదీశ్, భిక్షం, గణేశ్, ఏవీ చారి పాల్గొన్నారు.

జేఏసీ ప్రధాన డిమాండ్లు..

- విద్యార్థుల మెస్‌చార్జీలు పెంచాలి. స్టడీ టేబుల్స్, కాట్స్ అందించాలి.
- వైద్యం బాధ్యతలు స్థానిక డాక్టర్లకే ఇవ్వాలి
- అన్ని గురుకులాల్లో మౌలిక వసతులకు బడ్జెట్ విడుదల చేయాలి.
- బోధనా సమయాన్ని 9 నుంచి 4:30 గంటల వరకు కొనసాగించాలి.
- గురుకులాల్లోనూ ప్రమోషన్ నిష్పత్తిని 70:30గా నిర్ణయించాలి.
- 317 జీవోతో ఇతర జోన్లలో అలాటైన వారిని సొంతజోన్లకు పంపించాలి.
- అన్ని గురుకులాల నిర్వహణకు కామన్ డైరెక్టరేట్‌ను ఏర్పాటుచేయాలి.
- ఉపాధ్యాయుల జీతాలను 010 పద్దు ద్వారా ఒకటో తారీకునే చెల్లించాలి.
- ఆర్ట్స్, క్రాఫ్ట్స్, మ్యూజిక్, స్టాఫ్‌నర్స్‌లకు పదోన్నతి కల్పించాలి.
- రెగ్యులర్ డిప్యూటీ వార్డెన్లు, నైట్ వాచ్‌మెన్లను నియమించాలి.
- కేర్‌టేకర్, నైట్‌స్టే బాధ్యతల నుంచి టీచర్లను మినహాయించాలి.
- కాంట్రాక్టు, గెస్ట్, పార్ట్‌టైం, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలి.
- ఉపాధ్యాయులకు బేసిక్‌పేతో 12 నెలల వేతనాలు చెల్లించాలి.

బ్యాంకర్లపై చర్యలకు ఫిర్యాదు చేస్తాం

- రుణమాఫీ అమలులో నిర్లక్ష్యంపై..
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

ములుగు మండలం శివతండాలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ములుగు, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ) : రుణమాఫీ అమలులో నిర్లక్ష్యంవహించిన బ్యాంకర్లపై చర్యలకు సంబంధిత బ్యాంకుల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ప్రకటించారు. ములుగు మండలం శివతండా గ్రామంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆమె మాట్లాడుతూ.. ములుగు జిల్లాలోని రైతులకు రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం 190 కోట్లు మంజూరు చేసిందని అన్నారు. బ్యాంకర్ల నిర్లక్ష్యం కారణంగా కేవలం 100 కోట్ల మేర రైతుల ఖాతాల్లో జమయ్యాయని పేర్కొన్నారు. విషయం కలెక్టర్ దృష్టికి రావడంతో ఇటీవల ఏటూరు నాగారం ఐటీడీఏలో బ్యాంకర్లతో సమీక్ష నిర్వహించామని, 15 రోజుల క్రితం మరో 40 కోట్లు జమ చేయించినట్టు తెలిపారు. మరో 50కోట్లు బ్యాంకర్ల వద్దనే ఉన్నాయని, వాటినీ ఖాతాల్లో జమ చేయిస్తామని హామీ ఇచ్చారు.

ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వ కమిటీ

- మంత్రి ఉత్తమ్ నేతృత్వంలో ఏర్పాటు

హైదరాబాద్, సెప్టెంబర్12 (నమస్తే తెలంగాణ): ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను వర్గీకరణ తీర్పుపై అధ్యయనం, సిఫారసులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర సాగునీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చైర్మన్‌గా, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కోచైర్మన్‌గా, మంత్రులు సీతక్క, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి సభ్యులుగా, ఎస్సీ అభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీని మెంబర్ సెక్రటరీగా నియమించారు. కమిటీ ఏర్పాటుపై ఎస్సీవర్గాల్లో భిన్నస్వరాలు వినిపిస్తున్నాయి.

రుణమాఫీ కోసం 16న ధర్నాలు

- తహసీల్దార్ ఆఫీసుల ఎదుట ఆందోళన
- రైతు ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపు

ఆర్మూర్‌లో మీడియాతో మాట్లాడుతున్న రైతు జేఏసీ నాయకులు

ఆర్మూర్‌టౌన్ , సెప్టెంబర్ 12: షరతుల్లేని రుణమాఫీ, రైతుభరోసా వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16న ధర్నాలు నిర్వహించనున్నట్టు రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు ఇట్టడి గంగారెడ్డి, నూతుల శ్రీనివాస్, దేగాం యాదాగౌడ్, సుక్కి సుధాకర్, తిరుపతిరెడ్డి, అల్లూరి గంగారెడ్డి ప్రకటించారు. నిజామాబాద్ రూరల్, బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాల్లోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఆందోళన చేపట్టనున్నట్టు వారు తెలిపారు. గురువారం వారు ఆర్మూర్‌లో సమావేశమై భవిష్యత్ కార్యాచరణను ప్రకటించారు. కాంగ్రెస్ ఎన్నికల హామీ మేరకు షరతులు లేకుండా 2 లక్షల రుణమాఫీ చేయాలని, రైతు భరోసా కింద రూ.7,500 చొప్పున ఇవ్వడానికి సెప్టెంబర్ 15 వరకు తాము ఇచ్చిన గడువు దగ్గరకొస్తుందని తెలిపారు. రైతు భరోసా యాప్‌లో తెల్ల రేషన్‌కార్డు లేని రైతు కుటుంబాలను నిర్ధారిస్తున్నామని కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుటుంబ నిర్ధారణ పూర్తయిన రైతులకు ఎందుకు రుణమాఫీ చేయడం లేదని ప్రశ్నించారు. రూ.2 లక్షల పైన అప్పు ఉన్న రైతుల పరిస్థితిపై ఇప్పటివరకు స్పష్టత ఇవ్వలేదని మండిపడ్డారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈ నెల 16న అన్ని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహిస్తామని తెలిపారు.

గురుకుల టీచర్లు ఆందోళనకు సిద్ధంకండి

- టీఎస్‌యూటీఎఫ్, గురుకుల జేఏసీ పిలుపు

హైదరాబాద్, సెప్టెంబర్ 12(నమస్తే తెలంగాణ): న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆందోళనలకు సిద్ధంకావాలని టీఎస్‌యూటీఎఫ్, గురుకుల జేఏసీ నాయకులు గురుకుల ఉద్యోగులు, టీచర్లకు పిలుపునిచ్చాయి. టీఎస్‌యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి చావ రవి, గురుకుల జేఏసీ అధ్యక్షుడు మామిడి నారాయణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ మధుసూదన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కే జనార్దన్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. గురుకులాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు బోధించాలని ప్రభుత్వం అశాస్త్రీయంగా జీవో నంబర్‌ను 16ను విడుదల చేసిందని ఆక్షేపించారు. దీంతో 30వేల మంది ఉద్యోగులు, 6 లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులుపడాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఆందోళనల నిర్వహణకు కార్యాచరణ రూపొందిస్తున్నామని, గురుకులాల ప్రిన్సిపాళ్లకు గురువారం నోటీసులు సైతం అందించినట్లు స్పష్టం చేశారు.